సాక్షి అనంతపురం

సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



టమాట కిలో రూ.22

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది. మార్కెట్‌కు 285 టన్నుల టమాటాలు అమ్మకానికి వచ్చాయి.



'భవిత'.. భరోసా

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత కేంద్రం అండగా నిలుస్తోంది. విద్యా బోధన, ఆట పాటలతో ఇస్తున్న శిక్షణ సత్ఫలితాలిస్తోంది.

8లో

గరిష్టం/కనిష్టం

38.2°/13.8°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చలి వాతావరణం కొన సాగింది. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

కరువును తరిమి.. సిరులు పంచి..



వజ్రకరూరు మండలం రాగులపాడు లిఫ్ట్ వద్ద హంద్రీ–నీవా కాలువలోకి నీటి పంపింగ్ దృశ్యం (ఫైల్)

- 'అనంత' దశ–దిశ మార్చిన హంద్రీ–నీవా
- కృష్ణా జలాల రాకతో తొలగిన దుర్భిక్షం
- గతంలో ఎటు చూసినా బీడుభూములే
- నేడు పచ్చని పంటలతో కళకళ
- వందలాది గ్రామాలకు తొలగిన కన్నీటి' కష్టాలు

నాడు



బుక్కపట్నం చెరువు ఆయకట్టు భూములు ఇలా బీడు ఉండేవి. గతంలో పదేళ్లకు ఒకసారి కూడా చెరువు నిండేది కాదు. సాగు నీరు లేక ఆయకట్టు భూములన్నీ నెర్రెలు చీలి ఉండేవి. పంటలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

నేడు



బుక్కపట్నం చెరువు కింద అధికారికంగా 3,400 ఎకరాలు, అనధికారికంగా మరో మూడు వేల ఎకరాల భూములు సాగులోకి వచ్చాయి. ఈ ప్రాంతమంతా పచ్చని పంటలతో కోనసీమను తలపిస్తోంది. హంద్రీ–నీవా ద్వారా చెరువుకు చేరుతున్న కృష్ణా జలాలు ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలంగా మార్చేశాయి.



ఇది వజ్రకరూరు మండలం పాత కడమలకుంట గ్రామం వద్ద హంద్రీ–నీవా కాలువ నీటితో రైతులు సాగు చేసిన వేరుశనగ పంట. ఈ గ్రామ పరిసరాల్లో ఎటు చూసినా పచ్చని పంటలు కనువిందు చేస్తున్నాయి. మూడు వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా.. సుమారు 80 శాతం హంద్రీ–నీవా నీటిపై ఆధారపడి సాగులోకి వచ్చింది. వేరుశనగతో పాటు బ్యాడిగ మిరప తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. హంద్రీ–నీవా రాకముందు ఈ గ్రామ భూములన్నీ బీడు ఉండేవి. రైతులు, కూలీలు పొట్టచేతబట్టుకుని తిరుపతి, రైల్వే కోడూరు తదితర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. ఈ ఒక్క గ్రామమే కాదు.. వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల, ఛాయాపురం, పొట్టిపాడు, రాగులపాడు, కొత్త కడమలకుంట, పీసీ ప్యాపిలి గ్రామాల రైతుల జీవితాల్లో హంద్రీ–నీవా వెలుగులు నింపింది.

హంద్రీ–నీవా ద్వారా ఉమ్మడి జిల్లాకు వచ్చిన నీరు, నింపిన చెరువులు

సంవత్సరం	వచ్చిన నీరు (టీఎంసీలలో)	నింపిన చెరువులు
2012-13	2.00	0
2013-14	5.35	12
2014 -15	12.58	11
2015 -16	5.96	11
2016 -17	26.30	44
2017 -18	26.03	69
2018 -19	26.94	100
2019 -20	30.63	141
2020-21	34.75	142
2021-22	21.14	88
2022-23	17.69	45

అనంతపురం డెస్క్ :

సకల జీవరాశి మనుగడకు నీరు అత్యంత ప్రధానం. అందుకే నీరున్న చోటే ప్రధాన నాగరికతలన్నీ వర్ధిల్లాయి. నీరు లేకపోతే దుర్భిక్షం, అశాంతి రాజ్యమేలుతాయి. ఒకప్పుడు 'అనంత'లో ఇవే పరిస్థితులు ఉండేవి. ఒకవైపు కరువు, మరోవైపు ఫ్యాక్షన్‌తో ప్రజలు నలిగిపోయేవారు. ఇప్పుడా పరిస్థితులు దాదాపు తొలగిపోయాయి. ఎటుచూసినా జలసిరులు, పచ్చని పంటలతో పల్లెసీమలు అలరారుతున్నాయి. ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకుంటూ గ్రామీణులు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తున్నారు. దశాబ్ద కాలంలోనే ఈ మార్పు సాధ్యపడింది. ఇందుకు ప్రధాన కారణం 'అనంత వెంకటరెడ్డి హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం'.

జీవితాలను మార్చిన దార్శనికత..

హంద్రీ–నీవా ద్వారా రాయలసీమ, మరీముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లా స్థితిగతులను మార్చవచ్చునని గట్టిగా నమ్మిన వ్యక్తి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి. అందుకే జలయజ్ఞంలో భాగంగా ఈ పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. వైఎస్సార్ కంటే ముందున్న పాలకులు రెండుసార్లు హంద్రీ–నీవాకు శంకుస్థాపన చేసినప్పటికీ పనులు మాత్రం అడుగు కూడా ముందుకు పడలేదు. జలయజ్ఞంలో భాగంగా ఈ పథకాన్ని చేపట్టిన తర్వాతే పనులు పరుగులు పెట్టి..కృష్ణా జలాలు 'అనంత' చెంతకు చేరాయి.

కాలువలో నీరు..పెరిగిన భూగర్భజలాలు..

శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ఆధారంగా 40 టీఎంసీల సామర్థ్యంతో హంద్రీ–నీవా చేపట్టారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల్లో 7.046 లక్షల ఎకరాలకు (సవరించిన అంచనాల ప్రకారం) సాగునీరు, 33 లక్షల జనాభాకు తాగునీటి వసతి కల్పించడం ఈ పథకం ముఖ్యోద్దేశం. ఇందులో 4.11 లక్షల ఎకరాల ఆయకట్టు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోనే ఉంది. పథకంలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా మల్యాల నుంచి చిత్తూరు జిల్లా కుప్పం వరకు 565 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువను రెండు దశల్లో తవ్వారు. ఈ కాలువకు 2012 సంవత్సరం నుంచి నీటిని వదులుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గుంతకల్లు, ఉరవకొండ, రాప్తాడు, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల మీదుగా ప్రధాన కాలువ వెళుతోంది. కాలువలో ఏటా క్రమం తప్పకుండా నీటి ప్రవాహం ఉంటుండడంతో చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల మేర భూగర్భజలాలు వృద్ధి చెందాయి. గతంలో ఐదారు వందల అడుగులు తవ్వినా బోర్లలో నీళ్ల పడేవి కాదు. కానీ ఇప్పుడు వంద అడుగులలోపే సమృద్ధిగా లభిస్తున్నాయి. అలాగే కాలువ ద్వారా కృష్ణా జలాలతో అవకాశం ఉన్న చెరువులన్నింటినీ నింపుతున్నారు. 2021–22లో ఏకంగా 88 చెరువులను నింపారు. 2022–23లో 45 చెరువులకు నీరిచ్చారు. ఈ ఏడాది వర్షాల వల్ల చాలా చెరువులకు నీరు రావడంతో కృష్ణా జలాలు పెద్దగా అవసరం పడలేదు.

పంటలతో కళకళ..

హంద్రీ–నీవా కాలువ పరిసర పొలాలు, చెరువుల ఆయకట్టు భూములు నేడు పంటలతో కళకళలాడుతున్నాయి. వేరుశనగ, మొక్కజొన్న, మిరప, వరి తదితర పంటలతో పాటు ఉద్యాన తోటలు కూడా పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. కాలువకు మోటార్లు పెట్టుకోవడం, సమీపంలోనే బోరుబావులు తవ్వుకోవడం ద్వారా నీటిని పారించుకుంటున్నారు. కాలువ పరిసరాల్లో సుమారు 50 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులోనూ అత్యధికంగా వేరుశనగ సాగు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇక హంద్రీ–నీవా వచ్చిన తర్వాత ఉద్యాన పంటలకు కూడా ఊతమొచ్చింది. అరటి, చీనీ, మామిడి, జామ, బొప్పాయి తదితర పండ్ల తోటలు గణనీయంగా సాగులోకి వచ్చాయి. ఉమ్మడి అనంతలో దశాబ్దం కిందట లక్ష హెక్టార్లలో ఉన్న ఉద్యాన తోటలు నేడు దాదాపు రెట్టింపు స్థాయికి చేరాయంటే ఇందులో హంద్రీ–నీవా పాత్ర కూడా విశేషంగా ఉంది.

ద్రాక్ష సాగు చేశా



జీడిపల్లి రిజర్వాయర్ వల్ల భూగర్భజలాలు బాగా పెరిగాయి. మా పొలంలో బోరుబావులు వేయించగా నీళ్లు సమృద్ధిగా పడ్డాయి. దీంతో నాలుగు ఎకరాల్లో ద్రాక్ష తోట వేశా. మంచి దిగుబడులు వస్తున్నాయి. ఈసారి టన్ను రూ.50 వేలు చొప్పున తోట వద్దే విక్రయించా. పెట్టుబడులు పోనూ ఎకరానికి రూ.5 లక్షల వరకు నికర లాభం ఆర్జించా.

– దొనేష్‌రెడ్డి, రామసాగరం గ్రామం, బెళుగుప్ప మండలం

మా బతుకులు బాగు పడ్డాయి



నాకు ఐదెకరాల భూమి ఉంది. గతంలో వర్షం వస్తే గానీ పంట పండేది కాదు. కుటుంబాన్ని పోషించుకోవడానికి వలసలు వెళ్లేవాళ్లం. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. హంద్రీ–నీవా నీటితో ఏటా రెండు పంటలు పండిస్తున్నాం. ఇప్పుడు వేరుశనగ సాగు చేశా. పంట కోత దశలో ఉంది. హంద్రీ–నీవా కాలువ రాకపోయి ఉంటే మా బతుకులు దుర్భరంగా ఉండేవి.

– రామలింగప్ప, పాత కడమలకుంట, వజ్రకరూరు

గణనీయమైన మార్పు



కృష్ణా జలాలు రావడంతో రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు వచ్చింది. పెద్దఎత్తున పంటలు పండించుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. పిల్లలను బాగా చదివించుకుంటున్నారు. పెద్ద నగరాల్లో సైతం చదివించే స్థాయికి ఎదిగారంటే వారి జీవితాల్లో హంద్రీ–నీవా ఎలాంటి మార్పు తెచ్చిందో అర్థం చేసుకోవచ్చు.

– దేశేనాయక్, ఎస్‌ఈ, హంద్రీ–నీవా

న్యూస్‌రీల్

నేడు అనుబంధ విభాగాల అధ్యక్షుల పరిచయం

అనంతపురం సప్తగిరి సర్కిల్: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా నూతన అధ్యక్షుల పరిచయ కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటలకు నగరంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. రాష్ట్ర మంత్రి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషశ్రీచరణ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

నేడు 'స్పందన' రద్దు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జరగాల్సిన 'స్పందన'ను రద్దు చేసినట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు.

మద్దతు ధరతో జొన్నలు, రాగుల కొనుగోళ్లు



మాట్లాడుతున్న డీఎం నీలమయ్య

బొమ్మనహాళ్: రైతుల నుంచి జొన్నలు, రాగులను ప్రభుత్వమే నేరుగా మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని పౌర సరఫరాల డీఎం నీలమయ్య తెలిపారు. ఆదివారం ఉద్దేహాళ్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో జొన్నలు, రాగుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం నీలమయ్య మాట్లాడుతూ 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా గుర్తించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో రైతులు పండించిన జొన్నలు, రాగులను ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న తర్వాత కొనుగోలు కేంద్రంలో పంట విక్రయించాలన్నారు. జొన్నలకు ప్రభుత్వం క్వింటా రూ.2,970గా మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. రాగులకు మద్దతు ధర ఎంతనేది త్వరలోనే ప్రకటిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీఎల్ సీఈ చంద్రమోహన్, నాగభూషణరెడ్డి, ఏఓ అహమ్మద్‌బాషా, తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ భోగన్‌గౌడ్, సొసైటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, సీఈఓ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవలు విస్తరించాలి

- సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్





మహిళా సాధనా శిబిర్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న రత్నాకర్

ప్రశాంతి నిలయం: సత్యసాయి సంస్థల ద్వారా సేవలు మరింత విస్తరించి అభాగ్యులకు అండగా నిలవాలని భక్తులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు పిలుపునిచ్చారు. మూడు రోజులుగా ప్రశాంతి నిలయంలో జరగుతున్న మహిళా సాధనా శిబిర్ సదస్సు ఆదివారం ముగిసింది. సాయికుల్వంత్ సభా మందిరంలో ముగింపు వేడుకల్లో భాగంగా మహిళలు మార్చ్‌ఫాస్ట్ చేశారు. గుజరాత్ సత్యసాయి భక్తులు వేదపఠనం చేశారు. తర్వాత సత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గోవా తదితర రాష్ట్రాల్లో జరుగుతున్న సత్యసాయి ట్రస్ట్ సేవా కార్యక్రమాలను డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించారు. సత్యసాయి మహిళా విభాగం జాతీయ కో ఆర్డినేటర్ కమలా పాండ్య సత్యసాయి లక్ష్య సాధన కోసం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. సత్యసాయి సేవా సంస్థల ఆలిండియా అధ్యక్షుడు నిమీష్‌పాండే సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు, సాయి సేవలను క్షేత్ర స్థాయిలో అమలు చేయడంలో మహిళల పాత్ర గురించి వివరించారు. సదస్సులో పాల్గొన్న మహిళా ప్రతినిధులకు ఆర్.జె.రత్నాకర్, ఆయన సతీమణి హిమవాహిని చేతుల మీదుగా వస్త్రాలు పంపిణీ చేశారు. రత్నాకర్‌రాజు మాట్లాడుతూ సత్యసాయి 100వ జయంతి వేడుకలను ప్రపంచ నలుమూలలా సత్యసాయి కీర్తిని చాటేలా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. జయంతి రోజున ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. క్షేత్ర స్థాయిలో సేవలను మరింత మెరుగుపరిచే బాధ్యత భక్తులదేనన్నారు. సత్యసాయి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సెంట్రల్ ట్రస్ట్ కృషి చేస్తుందన్నారు.

'రైతు భరోసా' సొమ్ము రేపు విడుదల

అనంతపురం అగ్రికల్చర్: వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద ఈ ఏడాది(2022–23)కి సంబంధించి ఆఖరి విడతగా రూ.2 వేల పెట్టుబడి సాయం ఈ నెల 28న రైతుల ఖాతాల్లోకి జమ కానుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. సోమవారం జమ కావాల్సిన సొమ్ము సాంకేతిక కారణాల వల్ల ఒక రోజు ఆలస్యంగా మంగళవారం విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో తుది విడతగా 5,52,176 మంది రైతులకు రూ.115.66 కోట్లు విడుదల కానుందని తెలిపారు. ఏడాదికి రూ.13,500 చొప్పున ప్రతి రైతు కుటుంబానికీ 'రైతు భరోసా' సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఇలా వరుసగా నాలుగో ఏడాదికి సంబంధించి ఖరీఫ్‌కు సాయంగా 2022 మేలో రూ.7,500, రబీ సాయంగా అక్టోబర్‌లో రూ.4 వేలు చొప్పున జమ చేశారు. తుది విడతగా తాజాగా రూ.2 వేలు ఇస్తున్నారు. ఇందులో అనంతపురం జిల్లాకు రూ.59.11 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ.56.55 కోట్లు విడుదల చేయనున్నారు. ఇలా మొత్తంగా ఈ ఏడాది రెండు జిల్లాల పరిధిలో రూ.745 కోట్ల మేర రైతులకు లబ్ధి చేకూరుస్తున్నారు.

కట్టుదిట్టంగా ఇంటర్ ప్రాక్టికల్స్




ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలిస్తున్న రీజనల్ జాయింట్ డైరెక్టర్ రవి

అనంతపురం: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ రెండో సంవత్సరం సైన్స్ విద్యార్థులకు స్పెల్–1 (జనరల్) పరీక్ష 85 కేంద్రాల్లో నిర్వహించినట్లు ఆర్ఐఓ డాక్టర్ సురేష్‌బాబు తెలిపారు. అనంతపురం జిల్లాలో 52, శ్రీసత్యసాయి జిల్లాలో 33 కేంద్రాల్లో రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయి. ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు అనంతపురంలో 5, శ్రీ సత్యసాయి జిల్లాలో 11 కేంద్రాల్లో జరిగాయి. ఇంటర్మీడియెట్ బోర్డు పరిశీలకుడు నాగమణి, రీజనల్ జాయింట్ డైరెక్టర్ రవి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి వెంకటరమణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే

- జవాబుదారీగా వ్యవహరించాలి
- డీఐజీ ఎం.రవిప్రకాష్




మాట్లాడుతున్న డీఐజీ ఎం.రవిప్రకాష్

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: చట్టం ముందు అందరూ సమానమేనని అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవి ప్రకాష్ తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని సీఐ, ఆపై స్థాయి పోలీసు అధికారులతో డీఐజీ ఆదివారం సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. శాంతిభద్రతలు అదుపులో ఉండేలా చూసుకోవాలని పోలీసులకు సూచించారు. రోడ్లపై బూతులు మాట్లాడడం, తిట్టడం సరైంది కాదన్నారు. ప్రజల్లో చెడుగా ప్రవర్తించడం, అనవసరంగా లాఠీ చార్జ్ చేయడం, పోలీస్ వ్యవస్థకు చెడ్డపేరు తెచ్చేవిధంగా వ్యవహరించడం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు ప్రజలతో ఎలా మెలగాలో సూచించాలని ఎస్పీలకు సూచించారు. రాజకీయాల జోలికెళ్లకూడదని, న్యాయం వైపు పోలీసులు నిలబడాలని హితవు పలికారు. ఏ అధికారి అయినా కస్టోడియల్ హింసకు పాల్పడినా, ప్రజల్ని ఇబ్బందులు పెట్టే హీరోయిజం చూపించినా, చట్ట వ్యతిరేకంగా వ్యవహరించినా ఊరుకునేది లేదన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీలు ఫక్కీరప్ప, రాహుల్‌దేవ్‌సింగ్, పరమేశ్వరరెడ్డి, రిషాంత్‌రెడ్డి తదితరులు సెల్‌కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అంకెలోనే ఓటు

అక్షరాలు, గుర్తులు చెల్లవు

బ్యాలెట్ పేపర్ విధానంలోనే ఓటింగ్



ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఓటరు నమోదు సూచన పోస్టర్

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ బ్యాలెట్ పేపర్ విధానంలో జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ విధానం సార్వత్రిక ఎన్నికల ఓటింగ్‌కు భిన్నంగా ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల్లో గుర్తులు ఉంటాయి, ఓటు వేసేందుకు ఈవీఎంలు వినియోగిస్తారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ విధానం ఉంటుంది. ఇక్కడ ఓటర్లు తమకు ఇష్టమైన అభ్యర్థికి కేటాయించిన గుర్తుపై స్వస్తిక్ సింబల్ ముద్ర వేస్తారు. అయితే ఎమ్మెల్సీల్లో గుర్తులు ఉండవు. అభ్యర్థుల పేర్లు ఉంటాయి. వీటి ఎదురుగా 'అంకె'లోనే ఓటు వేయాలి. అలా కాకుండా అక్షరాలు, టిక్‌లు, ముద్రలు వేస్తే అది చెల్లదు. సాధారణ ఎన్నికల్లో ఓటరు ఒకరికే ఓటు వేయాల్సి ఉంటుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు ప్రాధాన్యత క్రమంలో అభ్యర్థులందరికీ ఓటు వేయొచ్చు. ఓటు ఎలా వేయాలి... ఎలా వేయకూడదో అవగాహన కల్పించేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా పోస్టర్లు రూపొందించింది. ఓటు విధానంపై మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు స్వీప్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను అధికార యంత్రాంగం నిర్వహించనుంది.

ఓటు ఇలా వేయాలి...

- ఎన్నికల యంత్రాంగం అందుబాటులో ఉంచిన వంగపూత (వైలెట్) రంగు స్కెచ్ పెన్‌తోనే ఓటు (నంబర్) వేయాలి. ఇతర పెన్నులతో వేయకూడదు.
- ఓటరు తాను నిర్ణయించుకున్న అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో అంకె (నంబర్) వేయాలి.
- ఒక ఓటరు తనకు నచ్చిన అభ్యర్థులకు తాను ఇవ్వదల్చుకున్న ప్రాధాన్యత నంబర్‌ను అభ్యర్థుల పేర్ల ఎదురుగా ఉన్న గడుల్లో ఇవ్వొచ్చు.
- అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉన్న గడిలో ఇంగ్లిష్ అంకెలు 1, 2, 3.... లేదా రోమన్ అంకెల్లో వేయొచ్చు.

ఓటు ఇలా వేస్తే చెల్లదు...

- ఒకే అంకె (నంబర్) ఇద్దరు అభ్యర్థులకు వేయకూడదు.
- ఒక అభ్యర్థికి ప్రాధాన్యత ఓటు అంకెలో వేసి మరొకరికి ముద్ర వేయకూడదు.
- ప్రాధాన్యత ఓటు అంకెల్లో కాకుండా అక్షరాల్లో రాయకూడదు.
- అభ్యర్థి ఎదురుగా గడిలో అంకె బదులుగా రైట్, ఇంటూ, ఇలా ఏ టిక్కూ వేయకూడదు.
- ఒక అభ్యర్థికి రెండు ప్రాధాన్యత ఓట్లు వేయకూడదు.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలోనే ఓటు వేయాలి. రెండు గడుల్లో సగం సగం వచ్చేలా వేయకూడదు.

ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ బ్యాలెట్ విధానంలో ఉంటుంది. ఓటరు తన ఓటును బ్యాలెట్ పేపర్‌లోని అభ్యర్థుల పేరుకు ఎదురుగా ఉన్న గడిలో ఆ అభ్యర్థికి ఇచ్చే ప్రాధాన్యత అంకెను వేయాల్సి ఉంటుంది. ఓటు ఎలా వేయాలి... ఎలా వేయకూడదు అనే అంశంపై అవగాహన కల్పించేందుకు స్వీప్ ఆధ్వర్యంలో మండలస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– కేతన్‌గార్గ్, రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్

రేపు జిల్లా స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

రాప్తాడు: అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామి తాత పరుషను పురస్కరించుకొని కాల్వ గొంచి వారి ఆధ్వర్యంలో ఆలయం దగ్గర జిల్లా స్థాయి రాతిదూలం లాగుడు పోటీలను మంగళవారం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పోటీలు ఉదయం 8 గంటలకు దేశీయ ఎద్దులతో జరుగుతాయన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్దులకు రూ.20 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎద్దులకు రూ.15 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన ఎద్దులకు రూ.10 వేలు, నాల్గో స్థానంలో నిలిచిన దేశవు ఎద్దులకు రూ.5 వేలు బహుమతి అందజేస్తారన్నారు. వివరాలకు 98667 66576, 97043 29378లో సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఎంవీఐ కారు

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురం సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం ఆర్టీసీ బస్సును ఓ కారు ఢీకొంది. అనంతపురానికి చెందిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తన కుటుంబసభ్యులతో కలసి కారులో పెనుకొండ నుంచి అనంతపురం వెళ్తుండగా... బెంగుళూరు నుంచి ఎమ్మిగనూరుకు వెళ తున్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు వెనుక భాగాన్ని కారు ఢీకొంది. దీంతో కారు ముందు భాగం దెబ్బతింది. సకాలంలో ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు.

భవిత.. భరోసా



చేతి వేళ్లకు వ్యాయామం చేయించుకుంటున్న ఈ బాలిక పేరు ఇందు. పుట్టపర్తి నగర పంచాయతీ పరిధిలోని ఎనుములపల్లికి చెందిన సుజాత కుమార్తె. ఎడమ చేతి వేళ్లు వంకరగా ఉండడంతో పుట్టపర్తిలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపి చేయిస్తున్నారు. ప్రస్తుతం బాలిక పరిస్థితి ఎంతో మెరుగుపడింది. చిన్నపాటి బరువులు ఎత్తుతోంది. మానసిక ఆందోళన సైతం పూర్తిగా తగ్గిపోయింది.



పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన సహీనా కుమార్తె తస్మీన్‌కు పుట్టుకతోనే కాళ్లు వంకర. దీంతో నడవలేకపోయేది. రెండేళ్ల పాటు పుట్టపర్తిలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపిస్ట్ వద్ద వ్యాయామాలు, నడకపై శిక్షణ ఇప్పించారు. ప్రస్తుతం కొంత నయమైంది. నడవ గలుగుతోంది.

... ఈ పరిస్థితి వీరిద్దరిదే కాదు.. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు గల ఎందరో చిన్నారులకు చికిత్స, సాయం అందించేందుకు జగన్ సర్కార్ ప్రత్యేక చొరవ తీసుకుంది. భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక అవసరాలు గల పిల్లల జీవితాల్లో భరోసా నింపుతోంది. ఈ కేంద్రాల్లో విద్యా బోధన, ఆట పాటలతో ఇస్తున్న శిక్షణ సత్ఫలితాలను ఇస్తుండడంతో ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రత్యేకావసరాల పిల్లలకు ప్రత్యేక శిక్షణ, వైద్యం
- పిల్లల్లో మెరుగుపడుతున్న నైపుణ్యాలు
- ఉమ్మడి జిల్లాలో 6,176 మంది గుర్తింపు



పుట్టపర్తిలోని భవిత కేంద్రం



చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పుతున్న ఐఈఆర్టీలు

పుట్టపర్తి అర్బన్: పుట్టుకతో కొందరు... మేనరిక వివాహాలతో మరికొందరు... పౌష్టికాహార లోపంతో ఇంకొందరు.. మానసిక, శారీరక లోపాలతో జన్మిస్తున్నారు. ఇలాంటి వారి మానసిక, శారీరక ఎదుగుదలకు భవిత కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 63 మండలాలకు 63 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో 20 మంది చొప్పున దాదాపు 1,612 మంది ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు సేవలు పొందుతున్నారు.

భవిత కేంద్రాల్లో శిక్షణలు ఇవే

వినికిడి లోపం, అంగవైకల్యం, దృష్టి లోపం, గ్రహణ మొర్రి, మాటలు రాని చిన్నారులు భవిత కేంద్రాల్లో శిక్షణ పొందుతున్నారు. సమస్యను ప్రాథమిక స్థాయిలో గుర్తించి దశలవారీగా శిక్షణ ఇస్తున్నారు. వినికిడి లోపం, మాటలు రాని పిల్లలకు పరికరాలను అమర్చడంతో పాటు స్పీచ్ థెరపీ చేయిస్తారు. చిన్నారులతో రాయించడం, పాటలు పాడించడం, బొమ్మలు గీయించడం వంటి అంశాలను చేయిస్తూ వారిలోని ప్రతిభను వెలికి తీస్తున్నారు. చిన్నారులకు అవయవ లోపాలు ఉంటే ఫిజియోథెరపి ద్వారా శిక్షణ ఇస్తున్నారు. అంధులకు బ్రెయిలీ లిపిపై అవగాహన కల్పిస్తున్నారు. చిన్నారుల మానసిక స్థితికి అనుగుణంగా విజ్ఞానాన్ని పెంపొందిస్తున్నారు.

గత ఏడాది చేసిన ఖర్చు

సరైన పోషకాహారం లభించకపోవడం, జన్యు లోపాలతో పాటు పోలియో, పక్షవాతం, వినికిడి లోపం, ఎముకల బలహీనత, బుద్ధిమాంద్యం, బహుళ వైకల్యం వంటి 21 రకాల వైకల్యాలతో బాధపడుతున్న చిన్నారులకు భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. విద్యాశాఖ, సమగ్ర శిక్షా కేంద్రం పర్యవేక్షణలో ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. శారీరక నిస్సహాయతతో భవిత కేంద్రాలకు రాలేని పిల్లలు ఉంటే ఐఈఆర్పీలు ఇంటికి వెళ్లి సేవలు అందిస్తారు. ఆయా కేంద్రాలకు వచ్చే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవలతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తారు. వీరికి నెలకు రూ.300 చొప్పున రవాణా భత్యం చెల్లిస్తారు. ఇంటి వద్దనే శిక్షణ పొందుతున్న వారికి నెలకు రూ.200 చొప్పున భత్యం ఇస్తున్నారు. ఈ లెక్కన ఎస్కార్ట్ అలవెన్స్ కింద గత ఏడాది 86 మందికి రూ.1.36 లక్షలు, ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ కింద 55 మందికి రూ.1.71 లక్షలు, హోం బేస్డ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా 620 మందికి రూ.11.16 లక్షలు, బాలిక స్టైఫండ్ కింద 713 మందికి రూ.8.55 లక్షలు, రీడర్ అలవెన్స్ కింద 163 మందికి రూ.2.92 లక్షలు కలిపి మొత్తం 1,637 మందికి రూ.25.71 లక్షలను గత ఏడాది ప్రభుత్వం వెచ్చించింది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. తీవ్రత తక్కువగా ఉన్న చిన్నారులు సైతం భవిత కేంద్రంలో శిక్షణ తీసుకున్న తర్వాత సాధారణ విద్యార్థులతో కలసి పాఠశాలలకు వెళ్తున్నారు.
– ఆనందబాబు, ఐఈఆర్టీ జిల్లా కో–ఆర్డినేటర్

63	ఉమ్మడి జిల్లాలో భవిత కేంద్రాలు
6,176 మంది	ప్రత్యేక అవసరాలు గల పిల్లలు
5,879 మంది	భవిత కేంద్రాల్లో నమోదు చేసుకున్న పిల్లలు
1,216 మంది	కేంద్రాల సేవలు పొందుతున్న పిల్లలు
21	కేంద్రాల్లో పనిచేస్తున్న ఫిజియోథెరపిస్టులు
90 మంది	పని చేస్తున్న ఐఈఆర్టీలు

గుర్రపు స్వారీలో నవ్యశ్రీకి బంగారు పతకాలు

పెనుకొండ: షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, దివంగత సాయికాశేశ్వర్ కుమార్తె నవ్యశ్రీ.. గుర్రపు స్వారీలో రెండు బంగారు, ఓ సిల్వర్ పతకాన్ని సాధించారు. ఈ మేరకు ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ నెల 21, 22, 25 తేదీల్లో ముంబయిలోని ఏఆర్‌సీ క్లబ్‌లో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బెంగళూరు అంతర్జాతీయ ఎంబస్సీ రైడింగ్ స్కూల్ తరఫున నవ్యశ్రీ పాల్గొన్నారు. మూడు విభాగాల్లో పోటీలు సాగాయి. డ్రెస్సేజ్ , క్రాస్ కంట్రీ, షో జంపింగ్ విభాగాల్లో తలపడిన నవ్యశ్రీ.. జాతీయ ఎక్వస్ట్రేయిన్ ఛాంపియన్ షిప్‌లో రెండు బంగారు పతకాలు, ఓ సిల్వర్ మెడల్‌ను సాధించింది. కాగా, గత ఏడాది డిసెంబర్‌లో భోపాల్‌లో జరిగిన జూనియర్ నేషనల్స్‌లో సైతం ఆమె వెండి, కాంస్య పతకాలను దక్కించుకుని తొలిసారిగా వెలుగులోకి వచ్చారు. ఈ సందర్భంగా నవ్యశ్రీని పలువురు అభినందించారు.



నవ్యశ్రీ



షో జంపింగ్ విభాగంలో తలపడిన నవ్యశ్రీ

బైక్‌లు ఢీ – ఒకరి మృతి

లేపాక్షి: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం బిసలమానేపల్లికి చెందిన బసవరాజు (48) మరో వ్యక్తితో కలసి ద్విచక్ర వాహనంపై ఆదివారం లేపాక్షి నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. ఏపీ గురుకుల పాఠశాల వద్దకు చేరుకోగానే వాహనాన్ని ఎడమవైపు తిప్పడంతో సైడ్ స్టాండ్ (స్టాండ్ తీయడం మరిచి బైక్ నడుపుతున్నారు) భూమికి తగిలి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఘటనలో బసవరాజుతో పాటు మరో బైక్‌పై ఉన్న చిలమత్తూరు మండలం పెద్దిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ వెంకటరామప్పతో పాటు చాగలేరు మాజీ సర్పంచ్ అశ్వత్థప్ప తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బసవరాజు పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు కుటుంబసభ్యులు తీసుకెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కాగా, మృతుడు అర్చక వృత్తితో జీవనం సాగిస్తున్నాడు. భార్య ఉంది. సంతానం లేదు. ఘటనపై లేపాక్షి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



బసవరాజ్ (ఫైల్)

తల్లి ప్రేమ!

కళ్యాణదుర్గం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన నరేష్ పెంచుకుంటున్న మేకపిల్లకు ఓ శునకం పాలిస్తూ చూపరులను ఆకట్టుకుంది. కొన్ని రోజుల క్రితం తల్లి మేక మృతిచెందింది. అప్పటి నుంచి బుడ్డీ పాలతో మేకపిల్లను పెంచుతున్నారు. ఈ క్రమంలో మూడు రోజులుగా మూడు పూటలా నిర్ణీత సమయానికి ఓ శునకం నరేష్ ఇంటి వద్దకు చేరుకుని మేక పిల్లకు పాలిస్తోంది. ఈ విషయం కాస్త తెలుసుకున్న స్థానికులు శునకం పాలిస్తుండగా ఆసక్తిగా గమనించి, తల్లి ప్రేమకు హద్దులేవని పేర్కొన్నారు.



మేకపిల్లకు పాలిస్తున్న శునకం

అగ్ని ప్రమాదంలో గడ్డి వాములు దగ్ధం

విడపనకల్లు: మండల పరిధిలోని పాలికి గ్రామ ఎస్సీ కాలనీలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుని నాలుగు గడ్డి వాములు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన రైతులు హరిజన కర్రెప్పగారి సుధాకర్, కర్రెప్పగారి సూరి ఇటీవల జొన్న సొప్పు, శనగ, చెనిక్కాయ పొట్టును వేర్వేరుగా వాములుగా వేశారు. వీటికి సమీపంలోనే రైతులు అంజనమ్మ కుమారుడు ఓబులేసు, బోడెన్న కుమారుడు ఓబులేసు సైతం గడ్డి వాములు వేశారు. ఆదివారం ఒక్కసారిగా మంటలు చుట్టుముట్టడంతో గడ్డివాములు మొత్తం కాలి బూడిదయ్యాయి. కాగా, ఘటనకు సంబంధించి విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగినట్లుగా కొందరు పేర్కొంటున్నారు. అయితే గడ్డివాములు వేసిన ప్రాంతానికి ఉపరితలంలో హెచ్‌టీ విద్యుత్ లైన్ ఉందని, గాలికి తీగలు తగులుకోవడంతో నిప్పు రవ్వలు ఎగిరిపడి గడ్డివాములు దగ్ధమైనట్లుగా మరి కొందరు తెలిపారు. ఘటనలో సుధాకర్, సూరికి రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లుగా తెలిసింది. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



మంటల్లో కాలిపోతున్న గడ్డివాములు

రాప్తాడు ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థిపై దాడి

రాప్తాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి రాజుపై రాప్తాడుకు చెందిన ఆటో డ్రైవర్ ప్రకాష్, అదే పాఠశాల పదో తరగతి విద్యార్థులు ముగ్గురు విచక్షణారహితంగా దాడి చేశారు. శనివారం సాయంత్రం ముస్లిం మైనారిటీ కాలనీ సమీపంలో చోటు చేసుకున్న ఈ దాడికి సంబంధించిన అంశాలను సెల్‌ఫోన్‌లో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు రాజు తెలిపిన మేరకు.... శనివారం పాఠశాల వదిలిన తర్వాత ఇంటికి వెళుతుండగా మొదట రాజును సహ విద్యార్థి కొట్టాడు. అనంతరం రాజు ముస్లిం మైనార్టీ కాలనీలోని తన ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత రాజుకు ఫోన్ చేసి మాట్లాడాలని రోడ్డుపైకి రప్పించుకుని బలవంతంగా ఆటోలో ఎక్కించి కాలనీ సమీపంలోని కంప చెట్లలోకి లాక్కెళ్లారు. అనంతరం ఆటో డ్రైవర్ ప్రకాష్, ముగ్గురు సహ విద్యార్థులు విచక్షణారహితంగా కొట్టి అక్కడే వదిలేసి వెళ్లారు. కాసేపటి తర్వాత తేరుకున్న రాజు.. నెమ్మదిగా ఇంటికి చేరుకుని జరిగిన విషయాన్ని కుటంబసభ్యులకు తెలపడంతో వారు 108 అంబులెన్స్ ద్వారా సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. రాజు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



రాజుపై దాడి చేస్తున్న దృశ్యం

విద్యార్థుల ఇంటి వద్దకే హెచ్‌ఎం

వజ్రకరూరు: పదో తరగతిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పాఠశాలలో మొత్తం 240మంది విద్యార్థులుండగా హెచ్‌ఎంతో కలుపుకుని 10 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో 30 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. సాయంత్రం స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి పాఠశాలలోనే చదివిస్తున్నారు. అనంతరం ప్రతి ఇంటికి తిరిగి ఇంటి వద్ద విద్యార్థులు పునశ్చరణ చేస్తున్నది, లేనిది తల్లిదండ్రులతో ఆరా తీస్తున్నారు. తెల్లవారుజామున ఎన్నిగంటలకు నిద్రలేస్తున్నారు? వారి దినచర్య ఏమిటి? తదితర అంశాలను ఆరా తీయడమే కాక పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో ఇతరత్రా పనులు చెప్పకుండా చదువుకునేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించేలా కుటుంబసభ్యుల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. కాగా, కుటుంబసభ్యులతో కలసి కళ్యాణదుర్గంలో నివాసముంటున్న రామచంద్రారెడ్డి... పరీక్షల సమయం దగ్గరపడడంతో పాఠశాలలోనే నిద్రిస్తూ విద్యార్థుల ప్రగతి పట్ల ప్రత్యేక చొరవ తీసుకోవడంపై స్థానికులు అభినందిస్తున్నారు.



విద్యార్థి చదువులపై తల్లితో ఆరా తీస్తున్న హెచ్‌ఎం రామచంద్రారెడ్డి

భా..రీ క్రేన్ వచ్చేసిందోచ్!

అనంతపురం సిటీ/క్రైం: అనంతపురానికి ఆదివారం ఓ భారీ క్రేన్ చేరుకుంది. దీనిని ప్రత్యేక వాహనంలో చెన్నై నుంచి తీసుకువచ్చారు. నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలో చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ) పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. ఈ క్రమంలో విద్యుత్ లైన్‌కు పైన గడ్డర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందు కోసం చెన్నై పోర్టు నుంచి 700 టన్నుల బరువున్న భారీ క్రేన్‌ను తెప్పించారు. రైల్వే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు అందగానే గడ్డర్లను ఏర్పాటు చేసి పనులు పూర్తి చేయనున్నారు. అనంతరం 45 రోజుల్లో మిగిలిన పనులు పూర్తి చేసి జాతికి అంకితమివ్వనున్నారు. ఈ అంశానికి సంబంధించి రైల్వే శాఖ ఉన్నతాధికారులతో అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, స్థానిక రైల్వే అధికారులు పలుమార్లు చర్చించారు.



క్లుప్తంగా

పంచాయతీ బోరు ధ్వంసం



బోరు ధ్వంసం చేసిన దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని పి. యాలేరు గ్రామంలో ఉన్న పంచాయతీ తాగునీటి బోరును గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి ధ్వంసం చేసినట్లు పంచాయతీ సెక్రటరీ ఖాదర్‌వలి ఆదివారం తెలిపారు. బోరు కేసింగ్ పైపు ధ్వంసం చేశారు. విషయాన్ని సర్పంచ్ ఆరోగ్యంరెడ్డితో కలసి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సెక్రటరీ తెలిపాడు.

పన్ను చెల్లింపులు వేగవంతం చేయాలి

అనంతపురం క్రైం: ఇంటి, నీటి, ట్రేడ్ లైసెన్స్ తదితర పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని అదనపు కమిషనర్ రెవెన్యూ సిబ్బంది, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులను ఆదేశించారు. ఆదివారం అదనపు కమిషనర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతేడాదితో పోలిస్తే పన్ను వసూళ్లలో వెనుకబడ్డారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వేసవికాలంలో ఉదయం 7:30 గంటల నుంచే క్షేత్ర స్థాయిలో పర్యటించి పన్ను వసూలు చేయాలన్నారు. వంద శాతం పన్ను వసూలు చేయడమే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. క్షేత్రస్థాయిలో విధులకు హాజరుకాని 20 మంది రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి మెమోలు ఇవ్వాలని అదనపు కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్ఐలు వేణు, మురళీ, బాబు, పద్మావతి, అడ్మిన్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న గెస్ట్ పీజీటీల అసోసియేషన్ జిల్లా చైర్మన్ కే విజయ్

అనంతపురం: కేజీబీవీ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గెస్ట్ పీజీటీల అసోసియేషన్ జిల్లా చైర్మన్ కే విజయ్ అన్నారు. ఆదివారం అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో కేజీబీవీ గెస్ట్ పీజీటీల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. గెస్ట్ పీజీటీలకు కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగించాలన్నారు. నిర్దిష్టమైన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో గెస్ట్ పీజీటీ అసోసియేషన్ సభ్యులు పుష్పావతి, మంజుల, సమీరా మాధవి, స్వాతి, నిరోషా, సూరి, లక్ష్మీదేవి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

కొడిమిలో బీడీసీ కేంద్రం ఏర్పాటు



బీడీసీ కేంద్రం

రాప్తాడురూరల్: పాఠకులకు సేవలందించాలనే ఉద్దేశంతో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం కొడిమిలో పుస్తక నిక్షిప్త కేంద్రం (బీడీసీ)ని అందుబాటులోకి తెచ్చారు. రెండు రోజుల క్రితం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఉమ, కార్యదర్శి రమ ప్రారంభించారు. ఈ కేంద్రం గ్రామంలోని పాఠకులకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందని గ్రామస్తులు చెప్తున్నారు. విద్యావంతుల్లో పుస్తక పరిజ్ఞానం పెంపొందించేందుకు దినపత్రికలు, వివిధ పుస్తకాలు, నవలలు, మ్యాగజైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు బీడీసీ ఇన్‌చార్జ్ నరసింహులు తెలిపారు.

సెంట్రల్ వర్సిటీలో ఎన్నికలు నిర్వహించాలి



సంబరాలు నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓ పరమేష్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ ఘన విజయం సాధించిన సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో ఆదివారం సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సెంట్రల్ యూనివర్సిటీ నాయకులు అన్షిద్, దానియేష్, ఖాజా, ఉపేంద్ర, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



వైకల్యంపై యుద్ధం చేసి...కళపై కిక్ కొట్టి!

ప్రస్తుత పోటీ ప్రపంచంలో యుద్ధ కళలకు ఆదరణ ఉంది. ఆడ, మగ అన్న తేడా లేకుండా ఈ కళలో ప్రావీణ్యం పొందేందుకు విద్యార్థిదశ నుంచే తర్ఫీదు తీసుకుంటున్నారు. ప్రశాంత్ అనే క్రీడాకారుడికి యుద్ధకళ అంటే అమితాసక్తి. వైకల్యంపై యుద్ధం చేసి.. కళపై కిక్ కొట్టి.. కోచ్‌గా ఎందరికో స్ఫూర్తిగా నిలిచాడు. పై ఫొటోను చూస్తే వైకల్యం చిన్నబోయిందని చెప్పాలి. నగరంలోని రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్‌లో యుద్ధ కళల శిక్షణ ఇస్తున్నారు. అక్కడి కోచ్ సూచనల మేరకు ప్రశాంత్ అనే క్రీడాకారుడు చిన్నారులకు రౌండస్ కిక్, బ్యాక్ కిక్ పై శిక్షణ ఇవ్వడంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రశాంత్‌కు కుడి చేయి సమస్యగా ఉన్నా..సునాయాసంగా కిక్‌లు ఇస్తూ అందరినీ అబ్బురపరుస్తున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

అయ్యవారిపల్లిలో పరుష ప్రారంభం

రాప్తాడు: అయ్యవారిపల్లిలో ఎర్రితాత స్వామి పరుష ఆదివారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పరుష తొలిరోజు స్వామి కాపులు అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాల్వగొంచి వారు ఇంటి నుంచి నైవేద్యం తలపై పెట్టుకొని తెచ్చి, పూజలు చేశారు. ఆలయ సమీపంలోని వినాయకుడు, రాముడు, గోటుకూరప్ప స్వాములకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి అయ్యవారిపల్లి కాల్వగొంచివారు ప్రత్యేక పూజలు నిర్వహించి, సమారాధన చేశారు. 10 వేల మంది భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు.

వెలిసిన దుకాణాలు, బొమ్మల కొట్లు :

వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేశారు. గాజులు, మిఠాయిలు, బొరుగులు, బొమ్మల కొట్లు వెలిశాయి. రెండో రోజు సోమవారం స్వామికి ఆలయ కాల్వగొంచి వారు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేస్తారు. అదే రోజు ఆలయం దగ్గర సాయంత్రం 4 గంటల నుంచి పన్నేరపు బండ్లు కట్టి ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకుంటారు. రాత్రి 9 గంటలకు అయ్యవారిపల్లి కాల్వ గొంచి వారి ఆధ్వర్యంలో పంచ రత్నాలు అనే నాటకం ప్రదర్శిస్తారు. మూడో రోజూ మంగళవారం ఎర్రిస్వామి తాత ఆలయం దగ్గర ఉదయం రాతి దూలం పోటీలు, సాయంత్రం నాలుగు గంటలకు ఆలయం దగ్గర ఉట్ల పరుష జరుగుతుంది. రాప్తాడు ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పూజలందుకుంటున్న ఎర్రిస్వామి తాత మూలవిరాట్

రేపు జిల్లా స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

రాప్తాడు: అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామి తాత ఉట్ల పరుషను పురస్కరించుకొని కాల్వ గొంచి వారి ఆధ్వర్యంలో ఎర్రిస్వామి తాత ఆలయం దగ్గర జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలు ఉదయం 8 గంటలకు దేశవు ఎద్దులతో జరుగుతాయన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన దేశవు ఎద్దులకు రూ.20 వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన ఎద్దులకు రూ.15 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన ఎద్దులకు రూ.10 వేలు, నాల్గో స్థానంలో నిలిచిన దేశవు ఎద్దులకు రూ.5 వేలు బహుమతి అందజేస్తారన్నారు. వివరాలకు సెల్: 98667 66576, 97043 29378లో సంప్రదించాలన్నారు.

బాస్కెట్‌బాల్ విజేత రాక్ స్టార్స్ జట్టు



బాస్కెట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన రాక్ స్టార్స్ జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ బాలుర విజేతగా రాక్ స్టార్స్ జట్టు నిలిచింది. ద్వితీయ స్థానంలో బుల్స్ జట్టు, తృతీయ స్థానంలో ఎంఅండ్ఎం జట్టు నిలిచింది. బాలికల విభాగంలో విన్నర్‌గా ల్యాకర్స్ జట్టు, రన్నరప్‌గా గోల్డన్ స్టేట్, తృతీయ స్థానంలో పవర్ స్టార్స్ జట్టు నిలిచింది. క్రీడాకారులు ఇలాంటి టోర్నీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ కోచ్ వెంకటరమణ, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్ర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

లఘు చిత్రాలతో సామాజిక చైతన్యం

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

అనంతపురం కల్చరల్ : లఘు చిత్రాలతో సామాజిక చైతన్యం సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. సమాచార హక్కు చట్టంపై సామాజిక ఉద్యమకారులు కేపీ రాజు, తరిమెల రాజు 'ఆర్‌టీఐ ద పవర్ ఆఫ్ కామన్ మ్యాన్' పేరుతో తీసిన లఘు చిత్ర ప్రదర్శన ఆదివారం జరిగింది. స్థానిక నెహ్రూ యువకేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఆయనతో పాటు అబ్బా టీవీ డాక్టర్ హరిప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కళలు, ప్రచార సాధనాలు సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తాయన్నారు. అనంతలో ఎంతో మంది కళాకారులు సామాజిక చైతన్యం తీసుకురావడానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇలాంటి సందేశాత్మక చిత్రాలు అనంత వేదికగా రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర అధికారి శ్రీనివాసులు, విజయ్ సాయి, రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీహరి, నాగరాజు, అభినేత్రి మహిత, నటీనటులు రాజు, పుష్ప, సుధాకర్, కెమెరామెన్ పవన్, తిరుపాలు, కమలనాథ్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ గేయానంద్‌తో బుల్లితెర నటీనటులు

మానవత్వాన్ని చాటుకోవాలి

అనంతపురం సప్తగిరి సర్కిల్: సమాజంలో ప్రతి ఒక్కరూ మానవత్వం చాటుకోవాలని నగర మేయర్ వసీం తెలిపారు. ఆదివారం రాత్రి అశోక్‌నగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో మానవత–నైతికత అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ నదీం అహమ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సైపుల్లా బేగ్ హాజరయ్యారు. సమాజంలో మానవత్వాన్ని చాటుకోవడం ద్వారానే ప్రేమ, ఆప్యాయత, శాంతి, దయ, కరుణ, ఇతరుల పట్ల సహృద్భావం అలవడుతాయన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగర మేయర్ వసీం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న దృశ్యం

'అపూర్వ' సమ్మేళనం

అనంతపురం: అనంతపురం ఆర్ట్స్ కళాశాల డిగ్రీ 2005–08 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశాంక మౌళి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాల పురోగతికి దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం చదివే విద్యార్థులకు అన్ని విధాలుగా సహకారం అందించాలని కోరారు.

సర్పరూపుడికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామికి బంగారు కవచం, ధరింపజేసి, ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో స్వామిని అలంకరించారు. ఆలయంలోని మంజునాథ స్వామికి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

మిద్దెంతా..'చామంతి' సాగు

రాప్తాడురూరల్: సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మిద్దె తోటలో చామంతి తదితర సీడ్స్ మొక్కలు సాగు చేశారు. కళ్యాణదుర్గం రోడ్డులోని గుల్జార్‌బేగం నివాసంపై ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సుమారు 40 గ్రూపులు ఉన్నాయని సభ్యులు తెలిపారు. టెర్రస్ గార్డెన్ మీద అవగాహన కల్పిస్తూ పండ్లు, కాయగూరలు, ఆకుకూరలు రసాయన ఎరువులు లేకుండా పండించడం ద్వారా రాబోవు తరాలకు ఆరోగ్యాన్ని అందించాలన్నదే సంస్థ ఉద్దేశం అన్నారు. ఇందులో భాగంగానే అనంతపురం సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ సభ్యులు పాల్గొని, చామంతి మొక్కలు, ఇతర రకాలైన విత్తనాలు పంపిణీ చేశామన్నారు.



టెర్రస్‌పై సాగు చేసిన చామంతి

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచేగాక జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని 108 సాలగ్రామ శివలింగాలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఇలా చేయడం వల్ల కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. స్వామి మూలవిరాట్ అడుగున ఉన్న నీటిని భక్తులు బాటిళ్లలో తీసు కెళ్లారు. ఈనీటిని సేవిస్తే సకల రోగాలు నివారణ అయితాయని, పంట పొలాల్లో చల్లితే పంటలు సమృద్ధిగా పండుతాయని ప్రజల ప్రగాఢ విశ్వాసం.



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: విశ్వ బ్రాహ్మణులు, స్వర్ణకారులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. స్థానిక పాతూరులో నూతనంగా ఏర్పాటు చేసిన వసతి గృహాన్ని నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అనంత చంద్రారెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి ప్రారంభించారు. శ్రీ విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ పంచ వృత్తుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు భాస్కర్ బాబు ఆధ్వర్యంలో నిర్మించిన విశ్వ బ్రాహ్మణుల వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే స్వర్ణకారులు, విశ్వ బ్రాహ్మణులకు వసతి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రమేష్ గౌడ్, కార్పొరేటర్లు బాబా, అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర, నాయకులు వాల్మీకి హరి, లక్ష్మీనారాయణ, సురేంద్ర, జశ్వంత్ వ్యాస్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

బ్రాహ్మణ మహిళలు కదిలి రావాలి

- రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు రెంటచింతల దీప్తి

అనంతపురం కల్చరల్: ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో వచ్చే ఆదివారం రాజమండ్రిలో జరగనున్న జాతీయ మహిళా సదస్సును జయప్రదం చేయాలని సంఘం అధ్యక్షురాలు రెంటచింతల దీప్తి అన్నారు. ఆదివారం నగరంలోని ఆర్‌ఎఫ్‌రోడ్డులోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ మండపంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దీప్తి, నాగలక్ష్మి విలేకరులతో మాట్లాడారు. మార్చి 5న జరుగనున్న మహిళా సదస్సుకు రెండు రాష్ట్రాల నుంచి మహిళా ప్రతినిధులందరూ హాజరవుతున్నారన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం కావడానికి సన్నద్ధం చేసే సదస్సులో అందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహిళలు చైతన్యవంతం కావాలంటే కేవలం వంటింటికి పరిమితం కాకుండా సామాజిక సమస్యలపై దృష్టి సారించాలన్నారు. బ్రాహ్మణ సంఘం నాయకులు సంకేపల్లి సత్యనారాయణ, నరసింహశాస్త్రి, మధుసూదనశర్మ, పీవీ ప్రసాద్, సంధ్య, సోమశేఖరశర్మ తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు

రామోజీ.. నీ తప్పుడు రాతలు ప్రజలు నమ్మరు

- వైఎస్సార్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: రామోజీ.. నీ తప్పుడు రాతలు ప్రజలు నమ్మరని వైఎస్సార్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేసి, నిరసన తెలియజేశారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రామోజీ రావు చంద్రబాబు కోసం దిగజారి అసత్యపు రాతలు ఈనాడులో ప్రచురిస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఒక అపద్ధాన్ని పదే పదే ప్రచురించడం వల్ల అది నిజం కాదన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు తగిన బుద్ధి చెపుతారన్నారు. కార్యక్రమంలో విద్యార్థినాయకులు చంద్రశేఖర్ యాదవ్, హేమంత్ కుమార్, రమేష్, సునీల్ యాదవ్, నితిన్ రెడ్డి, అనిల్, హర్షరెడ్డి, తేజేశ్వరరెడ్డి, అన్వర్‌బాషా, శేఖర్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.



ఈనాడులో తప్పుడు కథనాలపై నిరసన తెలియజేస్తున్న విద్యార్థి నాయకులు

ట్రాన్స్‌ఫార్మర్ కిందే వ్యాపారాలు

అనంతపురం క్రైం: విద్యుత్‌నగర్ సర్కిల్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కిందనే వ్యాపారాలు జరుగుతున్నాయి. అందులోనూ సర్కిల్ నిత్యం అత్యంత రద్దీగా ఉంటుంది. భారీ వాహనాలు సైతం అదే మార్గాన జేఎన్‌టీయూ, కలెక్టరేట్, ప్రసన్నాయపల్లి వైపు వెళ్తుంటాయి. సర్కిల్‌లోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ కింద కూరగాయల వ్యాపారాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకునే ఓ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. అనుకోని ప్రమాదం ఏదైనా జరిగితే ప్రాణాలమీదకు వచ్చే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.



విద్యుత్‌నగర్ సర్కిల్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కింద వ్యాపారాలు చేస్తున్న దృశ్యం

మాసుమా బీబీ దర్గాలో ప్రార్థనలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని పాతూరులోని మాసుమా బీబీ దర్గాలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం , డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి ఆదివారం ప్రార్థనలు చేశారు. ముందుగా పూల చాదర్‌ను వారు సమర్పించారు. అనంతరం ఫాతెహా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రమేష్ గౌడ్, కార్పొరేటర్ బాబా, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో అధునాతన వైద్య సేవలు

- జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రజలకు అధునాతన వైద్య సేవలు అందుబాటులోకొచ్చినట్లు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని రాజహంస హోటల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహతి హాస్పిటల్‌ను శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, నగర మేయర్ వసీం , డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, స్థానిక డివిజన్ కార్పొరేటర్ జయలలితతో కలిసి ప్రారంభించారు. ఆస్పత్రిలో రోగులకు అందుబాటులో ఉన్న వైద్య సేవలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తోందన్నారు. ఆస్పత్రుల స్థితిగతులను పూర్తిగా మార్చారన్నారు. నాడు – నేడు ద్వారా ఆస్పత్రుల్లో ప్రత్యేక వసతులను కల్పిస్తున్నారన్నారు. వైద్య కళాశాలల్లో ప్రత్యేకంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి, నాణ్యమైన విద్యను వైద్య విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ శ్వేత మాట్లాడారు. అత్యాధునిక వైద్య పరికరాలతో వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. చిన్న పిల్లల, గర్భిణులు, బాలింతలకు, స్త్రీ వ్యాధులకు ప్రత్యేక వైద్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రమేష్ గౌడ్, కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, పవన్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహతి ఆస్పత్రిలో ఉన్న అత్యాధునిక పరికరాలను పరిశీలిస్తున్న నగర మేయర్ వసీం , అనంత చంద్రారెడ్డి తదితరులు